సాక్షి ఒడిశా

గురువారం । 17 । ఏప్రిల్ । 2025



వైద్యసౌకర్యాలు మెరుగుపర్చాలి

ఆదివాసీ, హరిజన ప్రాంతమైన రాయగడ జిల్లాలో ప్రజలకు సరైన వైద్య సౌకర్యాలు అందడం లేదని పలువురు ప్రజా ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు.

- 8లో



విద్యుత్ శాఖ నిర్లక్ష్యంపై ఆగ్రహం

జిల్లాలో విద్యుత్ శాఖ నిర్లక్ష్యంపై జిల్లా పరిషత్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.

- 8లో



ఘనంగా బెంగాలీ చైత్రమాస వేడుకలు

మల్కన్‌గిరి జిల్లా కేంద్రం మల్కన్‌గిరిలో బుధవారం బెంగాలీ నూతన సంవత్సర వేడుకలు(చైత్రమాస వేడుకలు) ఘనంగా నిర్వహించారు.

- 8లో

న్యూస్‌రీల్

554 కిలోల గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలతో పోలీసులు

రాయగడ: జిల్లాలోని పద్మపూర్ పోలీస్‌స్టేషన్ పరిధి ఒసారిగుడి అడవుల్లో పోలీసులు 554 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ముందస్తుగా వచ్చిన సమాచారం మేరకు ఒసారిగుడ అడవుల్లో సోమవారం సాయంత్రం ఆకస్మికంగా దాడులు చేపట్టారు. దీనిలో భాగంగా రవాణాకు సిద్ధంగా ఉండే గంజాయి బస్తాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గత కొన్నేళ్లుగా ఇక్కడ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు అక్రమంగా గంజాయి రవాణా జరుగుతున్నట్లుగా అందిన సమాచారం మేరకు, పద్మపూర్ ఐఐసీ ధరణీధర్ ప్రధాన్ ఒక బృందాన్ని ఏర్పాటు చేసి దాడులను నిర్వహించారు. పోలీసుల రాకను గమనించిన గంజాయి రవాణాదారులు బస్తాలను వదిలి పరారయ్యారు. గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు దుండగుల ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

పూరీకి ఓఎస్‌ఆర్టీసీ ప్రారంభం



ప్రారంభమైన బస్సు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా రాయిఘర్ సమితి కేంద్రం నుంచి పూరీ దివ్యక్షేత్రానికి ఓఎస్‌ఆర్టీసీ జగన్నాథ ఓల్వో బస్సును బుధవారం ప్రారంభించారు. ఈ బస్సు సాయంత్రం 5 గంటలకు రాయిఘర్ నుంచి ప్రారంభమై పపడాహండి, భవానీపట్న, జునాఘడ్, బలిగుడ, భువనేశ్వర్ మీదుగా పూరి చేరుకుంటుంది. తిరిగి సాయంత్రం పూరీలో 5 గంటలకు బయల్దేరి ఉదయం 7 గంటలకు రాయిఘర్ చేరుతుంది. ఈ బస్సులో మహిళలకు 50 శాతం రాయితీ కల్పించనున్నారు.

గజపతి బీజేడీ అధ్యక్షుడిగా ప్రదీప్ నాయక్



ప్రదీప్ నాయక్

పర్లాకిమిడి: విపక్ష బీజేడీ పార్టీ రాష్ట్రంలోని 19 జిల్లాలకు నూతన అధ్యక్షుల జాబితాను మంగళవారం రాత్రి ప్రకటించింది. వారిలో గజపతి జిల్లా బీజేడీ అధ్యక్షుడిగా ప్రదీప్ నాయక్ నియామకమయ్యారు. ప్రదీప్ నాయక్ అధ్యక్షుడిగా ఎంపికవ్వడం ఇది మూడోసారి. ఆయన నియామకంపై పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి, మాజీ ఎమ్మెల్యే కెంగం సూర్యారావు, తిరుపతి పాణిగ్రాహి, జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, బీజేడీ యువజన అధ్యక్షుడు శాసనం లింగరాజు, ఉపాధ్యక్షుడు లక్ష్మీకాంత పోరిచ్చా, పురపాలక సంఘ అధ్యక్షురాలు నిర్మలా శెఠి, గుసాని సమితి అధ్యక్షుడు ఎస్.వీ రాజు, కాశీనగర్ ఎన్ఏసీ అధ్యక్షురాలు మేడిబోయిన సుధారాణి, కాశీనగర్ బీజేడీ నాయకుడు మధు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

వంటగ్యాస్ ధరలు తగ్గించాలి



పర్లాకిమిడి హైస్కూల్ కూడలి వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

పర్లాకిమిడి: కేంద్ర ప్రభుత్వం పెంచిన వంటగ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం జిల్లా కార్యదర్శి దండపాణి రైయితో స్థానిక మహారాజా బాలుర హైస్కూల్ కూడలి వద్ద బుధవారం ఆందోళన చేపట్టారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడంతో నిత్యావసర వస్తువులపై భారం పడుతోందని, కేంద్ర, రాష్ట్రాల్లో డబుల్ ఇంజిన్ సర్కారుకు ఓటువేస్తే అనేక పన్నులు భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పెంచిన రూ.50 ఉపసంహరించుకోకుంటే ఆందోళన తప్పదని స్పష్టం చేశారు. నిరసన కార్యక్రమంలో సీపీఎం లిబరేషన్ నాయకులు శ్రీనివాస బెహరా, మోహిత్ మిశాల్, అల్లాన బాస్కరరావు, ఎ.శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహం.. వివాదం!

- బీజూ విగ్రహం ప్రతిష్టాపనకు రాజకీయ రంగు
- బీజేడీ, కాంగ్రెస్ శ్రేణుల మాటల యుద్ధం



మాజీ మంత్రి రబి నారాయణ నందో, బీజేడీ



జయపూర్ మున్సిపల్ కార్యాలయం వెనుక మూలన పడి ఉన్న బీజూ పట్నాయక్ విగ్రహం



పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద బీజూ విగ్రహ ప్రతిష్ట పనులు పరిశీలిస్తున్న వైస్ చైర్‌పర్సన్ బి.సునీత, కౌన్సిలర్లు

కొరాపుట్: బీజూ పట్నాయక్ విగ్రహం ప్రతిష్టాపన వివాదం చిలికిచిలికి గాలివానలా మారింది. ఇది బీజేడీ, కాంగ్రెస్ పార్టీ నాయకుల మధ్య మాటల యుద్ధానికి దారితీసింది. గురువారం బీజూ పట్నాయక్ 28వ వర్ధంతి అందుకు వేదిక కానుంది.

ఇదీ వివాదం..

జయపూర్ పట్టణంలో ఆరు అడుగుల బీజూ పట్నాయక్ విగ్రహం పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందు తగ్గట్లు మూడేళ్ల క్రితం విగ్రహం తీసుకొచ్చారు. అయితే ముఖంలో బీజూ రూపురేఖలు లేవని అత్యధికులు అభిప్రాయపడటంతో దానిని వెనక్కి పంపించారు. మరలా రెండేళ్ల క్రితం మరో విగ్రహం తీసుకొచ్చారు. మున్సిపల్ కార్యాలయంలో ఉన్న ఆ విగ్రమాన్ని నేటికీ ప్రతిష్టాపన చేయలేదు. కార్యాలయం వెనుక భాగంలోనే విగ్రహం పడి ఉంది. ఈ విగ్రహ ప్రతిష్ట కోసం వివాదం చెలరేగింది.

మున్సిపల్ కౌన్సిల్‌లో ఏకాభిప్రాయం..

జయపూర్ మున్సిపల్ కౌన్సిల్‌లో చైర్మన్ నరేంద్ర మహంతి కాంగ్రెస్ పార్టీకి చెందిన్పటికీ వారికి 13 మంది సభ్యులు ఉన్నారు. వైస్ చైర్మన్ బి.సునీత బీజేడీ పార్టీకి చెందినప్పటికి వారికి 15 మంది కౌన్సిలర్లు ఉన్నారు. బలాబలాలలో తేడా, పార్టీల మధ్య విబేధాలు ఉన్నప్పటికీ విగ్రహ ప్రతిష్ట విషయంలో ఏకాభిప్రాయం ఉంది. అయినా రెండేళ్లపైగా విగ్రహం మూలనే పడి ఉంది.

రబినారాయణ నందో అల్టిమేటం..

బిజూ విగ్రహం రెండేళ్లుగా ప్రతిష్ట కాకపోవడం తీవ్ర విచారకరమని బీజేడీకి చెందిన మాజీ మంత్రి రబినందో ఆవేదన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లో ఈ నెల 17లోగా ప్రతిష్ట పనులు ప్రారంభం కాకపోతే ఆందోళనకు దిగుతానని హెచ్చరించారు. తమ నాయకుడు విగ్రహ ప్రతిష్ట సత్వరం జరిగేలా చర్యలు తీసుకోవాలని అల్టిమేటం ఇచ్చారు.

అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశారు:



రబి నారాయణ నందో 15 ఏళ్ల పాటు జయపూర్ ఎమ్మెల్యేగా, అనేక ఏళ్లు మంత్రిగా ఉన్నా విగ్రహం ప్రతిష్టపై ఎందుకు చర్యలు తీసుకోలేదని కాంగ్రెస్‌కు చెందిన జయపూర్ ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహీనిపతి ప్రశ్నించారు. గత 24 ఏళ్లుగా రాష్ట్రంలో బీజేడీ ప్రభుత్వమే ఉందన్న విషయం మర్చిపోకూడదని గుర్తు చేశారు. అంతేకాక జయపూర్ మున్సిపాలిటీలో 3 సార్లు వారే అధికారంలో ఉన్నారని తెలిపారు.

– తారప్రసాద్

నెల రోజుల్లో ప్రతిష్ట



బీజూ విగ్రహం ప్రతిష్ట విషయంలో తమ నిర్లక్ష్యం ఏమీ లేదని మున్సిపల్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నేత నొరి మహంతి స్పష్టం చేశారు. నెల రోజులలో విగ్రహాన్ని ప్రతిష్ట చేస్తామని తెలిపారు. బీజేడీ నేతలు అధికారంలో ఉన్నప్పుడు ఏమీ చేయకుండా ఇప్పుడు మా మీద నింద వేయడం సరికాదన్నారు. కౌన్సిల్‌లో ఎటువంటి విభేదాలు లేవని స్పష్టం చేశారు.

–నొరి మహంతి

పోలీస్‌స్టేషన్ బయట ప్రతిష్టిస్తాం



బీజూ విగ్రహం ప్రతిష్టాపనకు బుధవారం స్థల పరిశీలన చేశామని బీజేడీ వైస్ చైర్‌పర్సన్ బి.సునీత తెలిపారు. పట్టణ పోలీస్ స్టేషన్ బయట విగ్రహ ప్రతిష్టాపనకు నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. ఉన్నతాధికారులు సైతం అంగీకరించారని పేర్కొన్నారు.

– బి.సునీత

విజేతగా సిరిగుడ



విజేత జట్టుతో అతిథులు

రాయగడ: స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో రాష్ట్ర అవతరణ దినోత్సవాలు పురస్కరించుకొని నిర్వహించిన ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో సిరిగుడ జట్టు విజేతగా నిలిచింది. అండర్-15 కేటగిరీలో నిర్వహించిన ఈ పోటీల్లో వివిధ ప్రాంతాల నుంచి 13 జట్లు పాల్గొన్నాయి. మంగళవారం సాయంత్రం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో సిరిగుడ, ఎంఎంజీ జట్లు తలబడ్డాయి. ఎంఎంజీ జట్టుపై రెండు గోల్స్ సాధించిన సిరిగుడ జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ రమేష్ చంద్ర నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సాహించాలన్న ఉద్దేశంతో ఈ పోటీలను నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి బసంత కుమార్ ప్రధాన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి.



ఫైనల్ మ్యాచ్‌లో తలపడుతున్న జట్లు

వసతి గృహంలో చోరీయత్నం



తలుపులను తెరిచిన దుండగులు



తాళాలు విరగొట్టిన దృశ్యం

రాయగడ: జిల్లా అదనపు కలెక్టర్ నిహారి రంజన్ కుహరో ఉంటున్న ప్రభుత్వ వసతి గృహంలో చోరీయత్నం జరిగింది. దుండగులు ఇంటి ప్రవేశ ద్వారానికి ఉన్నటువంటి తాళాలను విరగ్గొట్టి లోపలకి ప్రవేశించారు. అక్కడ మరో తలుపును కూడా పగలుగొట్టారు. మంగళవారం విధులపై బయటకు వెళ్లిన ఆయన ఇంటి తలుపులను వేశారు. అయితే ఇంటి ముందు ఏదో అలికిడి వినిపించడంతో అక్కడ నుంచి దుండగులు పరారయ్యారు. ఈ సమాచారం తెలుసుకున్న కుహరో తన ఇంట్లో చోరీకి యత్నం జరిగిందని సదరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు.

ఆక్రమణలు తొలగింపు



జేసీబీలతో కూల్చివేతలు చేపడుతున్న దృశ్యం



తమ నిర్మాణ సామగ్రిలను తరలిస్తున్న యజమానులు

కొరాపుట్: కొరాపుట్ జిల్లా కోట్‌పాడ్ పట్టణంలో భారీగా ఆక్రమణలు తొలగించారు. బుధవారం బీఎస్ఎన్ఎల్ కార్యాలయం నుంచి కుసిమి రోడ్డులో ఉన్న అనేక నిర్మాణాలు కూల్చివేశారు. చాలాకాలంగా ఈ రోడ్డులో భారీగా ఆక్రమణలు జరిగాయి. దీంతో వాహనాలు వెళ్లడానికి ఇబ్బందులు పెరిగాయి. అనేక ఫిర్యాదులు రావడంతో అధికారులు రంగంలోకి దిగారు. పురపాలక శాఖ సిబ్బంది పెద్దఎత్తున పోలీసు బలగాలను ఉదయం మోహరించారు. కూల్చివేతలు గుర్తించిన నిర్మాణాల యజమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినప్పటికీ అధికారులు దూకుడుగా వ్యవహరించి కూల్చివేతలు కొనసాగించారు. దీంతో భయపడిన ఆక్రమణదారులు స్వచ్ఛందంగా తమ నిర్మాణాలను తరలించడం ప్రారంభించారు. పలు హోర్డింగ్‌లు, సిమ్మెంట్ నిర్మాణాలు జేసీబీలతో కూల్చివేశారు.

జనావాసాల్లోకి హైనా



గాయపడిన దూడకు చికిత్స అందిస్తున్న పశు వైద్య సిబ్బంది

కొరాపుట్: జననావాసాల్లోకి హైనా ప్రవేశించి దూడపై దాడికి పాల్పడింది. బుధవారం వేకువజామున కొరాపుట్ జిల్లా బొరిగుమ్మ సమితి బీజాపూర్ గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గోపాలకృష్ణ అనే వ్యక్తికి చెందిన గోశాలలో ఆవుదూడపై దాడి జరగడంతో అరుపులకు గ్రామస్తులు మేల్కొన్నారు. దీంతో హైనా అటవీ ప్రాంతంలోనికి పారిపోయింది. ఇదే నెలలో మూడు మేక పిల్లలను హైనా ఎత్తుకుపోయిందని గ్రామస్తులు వాపోయారు. సమాచారం అందుకున్న అటవీ శాఖ సిబ్బంది గ్రామానికి చేరుకొని పశు వైద్య సిబ్బంది ద్వారా దూడకు చికిత్స అందించారు.

నకిలీ మద్యం కేంద్రంపై దాడులు



నకిలీ మద్యంతో పట్టుబడిన సంతోష్‌తో ఎక్సైజ్ పోలీసులు



మీడియా ముందు నకిలీ మద్యం తయారు చేస్తున్న సంతోష్

కొరాపుట్: నకిలీ మద్యం తయారీ కేంద్రంపై ఎక్సైజ్ పోలీసు అధికారులు దాడి చేశారు. పట్టణంలోని బెడావీధిలో విదేశీ మద్యం తయారవుతున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో ఆ ప్రాంతంపై నిఘా పెట్టారు. అనుమానిత ఇంటి నుంచి ఇప్పిలి సంతోష్ అనే వ్యక్తి వస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో ప్రశ్నించగా భారీ రాకెట్ బయటపడింది. నిందితుడు నకిలీ మద్యం తయారీ విధానం చూసి ఎక్సైజ్ పోలీసులు ఆశ్చర్యపోయారు. అతని వద్ద నుంచి ప్రముఖ బ్రాండ్స్ స్టిక్కర్లు, బాటిల్స్ మూతలు, స్పిరిట్, వివిధ రసాయనాలు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఎక్సైజ్ కార్యాలయంలో మీడియా నిర్వహించి కేసు వివరాలు వెల్లడించారు. ఖరీదైన బ్రాండ్ల మద్యాన్ని మీడియా ముందు తయారు చేసి నిందితుడు చూపించాడు. ఇన్‌స్పెక్టర్ శశికాంత్ దత్త మాట్లాడుతూ నిందితుడు చాలాకాలంగా ఇలా మద్యం తయారు చేసి, అనేక ప్రాంతాలకు సరఫరా చేస్తున్నాడన్నారు. ఈ కేసులో మరికొందరు హస్తం ఉందని, వారిని కూడా అరెస్ట్ చేస్తామని ప్రకటించారు.

కాంగ్రెస్ పొలిటికల్ ఎఫైర్స్ కమిటీలో ప్రాధాన్యం



ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి



కొరాపుట్ ఎంపీ సప్తగిరి శంకర్ ఉల్క



ఎమ్మెల్యే రాం చంద్ర ఖడం

కొరాపుట్: ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అత్యున్నత పొలిటికల్ ఎఫైర్స్ కమిటీలో కొరాపుట్ జిల్లా నేతలకు అధిక ప్రాధాన్యం లభించింది. బుధవారం ఆ పార్టీ జాతీయ కార్యదర్శి ఎంపీ కేసీ వేణుగోపాల్ 25 మంది నేతలతో జాబితా ప్రకటించారు. పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి అజయ్ కుమార్ లల్లు ఈ కమిటీని పర్యవేక్షిస్తారు. ఈ కమిటీలో కొరాపుట్ ఎంపీ సప్తగిరి శంకర్ ఉల్క ఉన్నారు. రాష్ట్రం నుంచి కాంగ్రెస్ పార్టీకి ఉన్న ఎకైక ఎంపీ ఉల్క కావడం గమనార్హం. సప్తగిరి ఉల్క ప్రస్తుతం ఈశాన్య రాష్ట్రాల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా కూడా పని చేస్తున్నారు. కొరాపుట్ జిల్లా పొట్టంగి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా కొనసాగుతన్న రాం చంద్ర ఖడంకి కూడా స్థానం లభించింది. రాం ఖడం ప్రస్తుతం సీఎల్పీ నాయకుడిగా కొనసాగుతున్నారు. అదేవిధంగా జయపూర్ ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతికి స్థానం కల్పించారు. బాహిణీపతి కొరాపుట్, జయపూర్ స్థానాల నుంచి కాంగ్రెస్ పార్టీ తరుపున 5 సార్లు ఎమ్మెల్యేగా గెలిపొందారు.

క్లుప్తంగా

మహిళలపై దాడులు అరికట్టాలి



ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జయపురం: రాష్ట్రంలో మహిళలు, విద్యార్థినులపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం రాత్రి మశాల(దివిటీ) జాతర నిర్వహించారు. కొరాపుట్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నళినీ రథ్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో కొరాపుట్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు శశిభూషణ్ పాత్రో తదితరులు పాల్గొన్నారు.

మవులి మా జాతర ప్రారంభం



మవులి మా జాతరలో పాల్గొని పూజలు చేస్తున్న నేతలు

జయపురం: జయపురం సబ్ డివిజన్ కొట్‌పాడ్ శాసనసభ నియోజకవర్గ పరిధి ఛతర్ల గ్రామ పంచాయతీ పటకికుంబ గ్రామం ప్రాంతంలో గల మవులి కోట మందిరంలో మవులి మా జాతర బుధవారం ప్రారంభమైంది. ఈ జాతరలో కొట్‌పాడ్, కుంధ్ర సమితుల నుంచి భక్తులు పోటెత్తారు. ఈ జాతరలో ప్రముఖ కాంగ్రెస్ నేత, కొట్‌పాడ్ సమితి మాజీ అధ్యక్షుడు నీలకంఠ పూజారి, మాజీ కౌన్సిలర్‌లు దేవీప్రసాద్ నాయక్, నరేంద్ర మఝి, యువజన కాంగ్రెస్ నాయకుడు కాళీ కృష్ణ తదితరులు అమ్మవారికి పూజలు చేశారు. కమసాయి బిశాయి, బుద్ర సిరా, జగన్నాథ్ గౌడ, రామచంద్ర దురువ, వార్డు మెంబర్ రామ భూమియ తదితరులు మవులి మా జాతరను నిర్వహించారు. ఈ జాతరలో పలు ప్రాంతాల నుంచి వందలాది మంది ప్రజలు పాల్గొని మవులి మాకు పూజలు చేశారు.

ఆరోగ్యమే మహాభాగ్యం



మాట్లాడుతున్న డాక్టర్ మనోజ్ బిశ్వాల్

జయపురం: పీఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల జయపురంలో బుధవారం ఆరోగ్య పరీక్ష శిబిరం నిర్వహించారు. హెచ్‌ఎం ప్రకాశ చంద్ర పట్నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జయపురం బ్లాక్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ (బీఈఓ)చందన కుమార్ నాయక్ హాజరయ్యారు. గౌరవ అతిథులుగా డాక్టర్ మనోజ్ బిశ్వాల్, డాక్టర్ సునీత సాహు పాల్గొన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, ఆరోగ్యాన్ని కాపాడుకోవటానికి ఎటువంటి శ్రద్ధ తీసుకోవాలో, వ్యాధుల నుంచి ఎలా రక్షించుకోవాలో, ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో డాక్టర్లు వివరించారు. పుష్టికరమైన ఆహారం తీసుకోవాలన్నారు. విద్యార్థులకు డాక్టర్లు, వైద్య సిబ్బంది ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హైవేపై అక్రమ వసూళ్లు!

ఇచ్ఛాపురం టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని బెల్లుపడ సమీపంలో పాత టోల్‌గేటు వద్ద అనధికార వ్యక్తులు వ్యవసాయ మార్కెట్ కమిటీ పేరుతో అక్రమ వసూళ్ల దందా సాగిస్తున్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ పేరిట రసీదు బుక్ చూపించి వసూళ్లకు పాల్పడుతున్నారు. ఆంధ్రా, ఒడిశా సరిహద్దులో ఇంటిగ్రేడ్ చెక్ పోస్టు ఉన్నప్పుడు అక్రమంగా వస్తువులు రవాణా చేస్తే వారి నుంచి అపరాధ రుసుం వసూలు చేసేవారు. ఇంటిగ్రేడ్ చెక్‌పోస్టు తొలగించాక అపరాధ రుసుం వసూలు చేయడం ఆగిపోయింది. ప్రస్తుతం మార్కెట్ కమిటీలో కొందరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, తోటపని చేసే వారు హైవేపై వ్యవసాయ ఉత్పత్తుల లారీల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. స్థానికులు, అధికారులు వచ్చే సమయంలో ఏమీ తెలియనట్లు పక్కకు జారుకుంటున్నారు. ఈ విషయమై వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ ఆంధ్రయ్య వద్ద ప్రస్తావించగా గతంలో కవిటి మండలం కరాపాడు టోల్‌గేటు వద్ద లారీలు ఆపి వ్యవసాయ ఉత్పత్తులు రవాణా చేసే లారీల నుంచి పన్ను వసూలు జరిగేదని, టోల్ గేట్ వారు అభ్యంతరం చెప్పడంతో పాత టోల్‌గేటు వద్దకు మార్చామని చెప్పారు.సూపర్‌వైజర్లు, ఇతర అధికారులే పన్ను వసూలు చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

పెన్షనర్ల సమస్యలపై వినతి

శ్రీకాకుళం అర్బన్: పెన్షనర్‌ల సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రా పెన్షనర్స్ పార్టీ అధ్యక్షుడు సుబ్బరాయన్ పాలంకి, ఏపీ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ చౌదరి పురుషోత్తమనాయుడు, జనరల్ సెక్రటరీ సతీష్‌కుమార్ కోరారు. ఈ మేరకు బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును రాష్ట్ర సెక్రటేరియేట్‌లో కలిసి వినతిపత్రం అందించారు.

పశువుల పట్టివేత

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలం నారాయణవలస సమీపంలో వ్యాన్‌లో 13 ఆవులను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం మేరకు కోట బొమ్మాళి ఎస్‌ఐ వి.సత్యనారాయణ సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహించారు. పశువులను తరలిస్తున్న వ్యాన్‌ను ఆపగా 12 మగదూడలు, ఒక ఆవు ఉన్నట్లు గుర్తించి వాటిని విజయనగరం జిల్లా కొత్తవలస గోశాలకు తరలించారు. అనంతరం ఆవులు అక్రమంగా తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేశారు.



లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర శాంత ఆధ్వర్యంలో ర్యాలీ



ముఖ్యమంత్రి దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న దృశ్యం



బొయిపరిగుడలో ఆందోళన చేస్తున్న కార్యకర్తలు



జయపూర్‌లో మున్సిపల్ చైర్మన్ నొరి మహంతి ఆధ్వర్యంలో ర్యాలీ



కుంద్రాలో కాంగ్రెస్ కార్యకర్తల ర్యాలీ



పొట్టంగిలో సీఎల్‌పీ నాయకుడు రాంఖడం ఆధ్వర్యంలో ర్యాలీ

వెల్లువెత్తిన నిరసనలు

రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఆందోళనలకు పిలుపునిచ్చింది. దీనిలో భాగంగా మంగళవారం రాత్రి రాష్ట్ర వ్యాప్తంగా కొవ్వొత్తులతో ర్యాలీలు చేపట్టింది. పీసీసీ అధ్యక్షుడు భక్త చరణ్‌దాస్ పిలుపుమేరకు కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కొవ్వొత్తులు, కాగడాలతో నిరసన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి మెహన్‌చరణ్ మజ్జి దిష్టిబొమ్మలను దహనం చేశారు. – కొరాపుట్

వైద్యసౌకర్యాలు మెరుగుపర్చాలి

● జెడ్పీ సమావేశంలో ప్రజా ప్రతినిధులు



సమావేశంలో ప్రజా ప్రతినిధులు, కలెక్టర్ పట్వారి తదితరులు

రాయగడ: ఆదివాసీ, హరిజన ప్రాంతమైన రాయగడ జిల్లాలో ప్రజలకు సరైన వైద్య సౌకర్యాలు అందడం లేదని పలువురు ప్రజా ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం వైద్యసేవలు, ఇతర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాయగడ ఎమ్మెల్యే అప్పలస్వామి కద్రక, గుణుపూర్ ఎమ్మెల్యే సత్యజీత్ గొమాంగొ, బిసంకటక్ ఎమ్మెల్యే నీలమాధవ హికక, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సరస్వతీ మాఝిలు ఈ మాట్లాడుతూ అత్యంత వెనుకబడిన ప్రాంతంగా గుర్తింపు పొందిన కాసీపూర్‌లోని గోరఖ్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుల కొరత వేధిస్తోందన్నారు. దీనిపై జిల్లా ముఖ్య వైద్యాధికారి డాక్టర్ లాల్‌మోహన్ రౌత్రాయ్ మాట్లాడుతూ మునిగుడ సమితి రఘుబారి గ్రామానికి సరైన రహదారి లేకపోవడంతో అత్యవసర సమయంలో అంబులెన్స్ సేవలు పొందలేకపోతున్నారని చెప్పారు.

312 వైద్యుల పోస్టులు ఖాళీ..

జిల్లాలో వివిధ ప్రాంతాల్లోని వైద్య కేంద్రాల్లో డాక్టర్ల కొరత ఉన్నట్లు జిల్లా ముఖ్యవైద్యాధికారి రౌత్రాయ్ వివరించారు. 461మంది వైద్యులు అవసరం కాగా, ప్రస్తుతం 149 మంది వైద్యులు మాత్రమే ఉన్నారని చెప్పారు. దీంతో సకాలంలో వైద్య సౌకర్యాలను ప్రజలు పొందలేకపోతున్నారని వివరించారు.

జిల్లాలో 14 వంతెనల నిర్మాణం..

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో రాకపోకలను సుగమం చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే రాయగడ, గుణుపూర్ సబ్ డివిజన్లలో బిజు సేతు పథకంలో భాగంగా 3579 కోట్ల రూపాయల వ్యయంతో నాలుగు వంతెనల నిర్మాణ పనులు పూర్తయ్యాయని చెప్పారు. మరో 14 చోట్ల వంతెన పనులు కొనసాగుతున్నాయని సంబంధిత అధికారులు వివరించారు. ముఖ్యమంత్రి సడక్ యోజనలో భాగంగా 18 రహదారుల పనులకు శ్రీకారం చుట్టగా ఇందులో 10 పూర్తయ్యాయని, మిగతా పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.

పెండింగ్ పనులు వేగవంతం..

జిల్లాలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఫరూల్ పట్వారి సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు రహదారి, విద్య, వైద్యం, తాగునీరు వంటి మౌలిక సౌకర్యాలు అందించే విషయంలో పక్కా ప్రణాళికతో వ్యవహరించాలన్నారు.

విద్యుత్ శాఖ నిర్లక్ష్యంపై ఆగ్రహం



జెడ్పీ సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులు

కొరాపుట్ : జిల్లాలో విద్యుత్ శాఖ నిర్లక్ష్యంపై జిల్లా పరిషత్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం కొరాపుట్ జిల్లా కేంద్రంలోని స్కిల్ డెవలప్‌మెంట్ సమావేశ మందిరంలో జెడ్పీ ప్రెసిడెంట్ సస్మితా మెలక అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జయపూర్ ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహిణీపతి మాట్లాడుతూ స్మార్ట్‌మీటర్లు పెట్టి ప్రజలను దోచుకుంటున్నారని, విద్యుత్ సమస్యలపై ప్రజల ఫిర్యాదులు పట్టించుకోవడం లేదన్నారు. వేసవిలో అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. తాగునీటి సమస్యపై గ్రామాల్లో ప్రజలు తమను నిలదీస్తున్నారని వాపోయారు. సమావేశంలో కలెక్టర్ వీ.కీర్తివాసన్, ఎమ్మెల్యేలు పవిత్ర శాంత (లక్ష్మీపూర్), రఘురాం మచ్చో (కొరాపుట్), రుపుధర్ బోత్ర(కొట్‌పాడ్), జిల్లా పరిషత్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా బెంగాలీ చైత్రమాస వేడుకలు

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రం మల్కన్‌గిరిలో బుధవారం బెంగాలీ నూతన సంవత్సర వేడుకలు(చైత్రమాస వేడుకలు) ఘనంగా నిర్వహించారు. స్థానిక సాంస్కృతిక భవనంలో బెంగాలీ మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వంటల ప్రదర్శన ఆకట్టుకుంది. బెంగాలీ సంఘ అధ్యక్షుడు గౌరంగో కార్మ్‌కార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న బెంగాలీలు



భజన చేస్తున్న బృందం



ర్యాలీలో పాల్గొన్న మహిళలు



ప్రసంగిస్తున్న బెంగాలీ సంఘ నాయకులు



సంప్రదాయ వస్త్రధారణలో మహిళలు

ట్రక్ యజమానుల ఆందోళన



గొడౌన్ ముందు ఆందోళన చేస్తున్న ట్రక్ యజమానులు

కొరాపుట్: ట్రక్ యజమానుల ఆందోళనతో పేదలకు పంచాల్సిన పీడీఎస్ బియ్యం రవాణా నిలిచి పోయింది. బుధవారం నబరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్‌కోట్ పట్టణంలోని పీడీఎస్ గొడౌన్ ముందు ఉమ్మర్‌కోట్ ట్రక్ యజమానుల సంఘం ప్రతినిధులు ఆందోళన చేపట్టారు. బియ్యం రవాణాను కాంట్రాక్టర్లు చేస్తున్నారన్నారు. తాము రవాణా చేయాల్సిన బియ్యాన్ని పీడీఎస్ కాంట్రాక్టర్లు చేయడం తగదన్నారు. తమ ట్రక్‌లు అనుమతించే వరకు గేట్లు తెరవనివ్వమన్నారు. దీంతో లోపల ఉన్న కాంట్రాక్టర్ల ట్రక్‌లు నిలిచిపోవడంతో బియ్యం రవాణా ఆగిపోయింది. ఈ నెలాఖరు నాటికి 40 వేల క్వింటాళ్ల బియ్యం పంచాయతీ కేంద్రాలకు చేరాల్సి ఉండగా.. ఇప్పటికి కేవలం వెయ్యి క్వింటాళ్ల బియ్యం మాత్రమే రవాణా జరిగింది.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన బైక్

● కె.కుపానుకుద్ది గ్రామ యువకుడు దుర్మరణం



మృతదేహం వద్ద వివరాలు సేకరిస్తున్న పోలీసులు (ఇన్‌సెట్లో) గోకిడి రవి(ఫైల్)

ఇచ్ఛాపురం : ఈదుపురం రోడ్‌లో మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కవిటి మండలం కె.కపాసుకుద్ది గ్రామానికి చెందిన గోకిడి రవి(25) అనే యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కె.కుపాసుకుద్ది గ్రామానికి చెందిన గోకిడి మాధవరావు, వేణు దంపతుల కుమారుడు రవి విదేశాల్లో వెల్డింగ్ పనుల చేసుకొంటూ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉండేవాడు. ఇరాక్ నుంచి నెల రోజుల కిందట ఇంటికి వచ్చాడు. మంగళవారం రాత్రి ఇంట్లో భోజనం చేసి ఇచ్ఛాపురంలో తన స్నేహితులను కలిసేందుకు వెళ్లాడు. తిరిగి ఇంటికి ద్విచక్రవాహనంపై వస్తుండగా ఈదుపురం రోడ్డులోని ఇటుకల బట్టీ సమీపంలో మలుపు వద్ద అదుపు తప్పి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి గుంతలో పడిపోయాడు. అర్ధరాత్రి కావడంతో ఎవరూ గమనించలేదు. దీంతో యువకుడు ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఉదయం అటువైపుగా వెళ్తున్న వారు మృతదేహాన్ని గమనించి పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి వివరాలు సేకరించి మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. తండ్రి మాధవరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్సై ముకుందరావు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చేతికందిన కొడుకు అనంతలోకాలకు వెళ్లిపోవడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేయాలని వినతి

సారవకోట: జిల్లాలోని గిరిజన పాఠశాలలను కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేయాలని కోరుతూ అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం ప్రతినిధులు సీతంపేట ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ మేరకు సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో కలిసి సమస్యలను వివరించారు. గిరిజన పంచాయతీలలో ఆరోగ్య ఉప కేంద్రాలు ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించాలని, తాగునీటి సమస్య లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు బైరిసింగి లక్ష్మీనారాయణ, అడవి రాముడు, చౌదరి లక్ష్మీనారాయణ, కొచ్చ శ్రీను, సింహాచలం పాల్గొన్నారు.

పురుగుమందు తాగి వృద్ధురాలి ఆత్మహత్య

రణస్థలం: మండలంలోని వెంకటరావుపేటకు చెందిన కొత్తకోట సత్యం(59) అనే వృద్ధురాలు పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. జె.ఆర్.పురం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొన్నాళ్లుగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న సత్యం మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో గడ్డిమందు తాగడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు గమనించి రణస్థలం సీహెచ్‌సీకి తరలించగా అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందింది. మృతురాలికి భర్త ఎల్లయ్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

టెక్కలి రూరల్: స్థానిక ఎన్‌టీఆర్ కాలనీ 7వ లైన్‌లో నివాసముంటున్న ముడిదాన కేశవరావు(38) బుధవారం రాత్రి తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నందిగాం మండలం హుకుంపేట గ్రామానికి చెందిన కేశవరావు టెక్కలి ఎన్‌టీఆర్ కాలనీ 7వ లైన్‌లో నివాసం ఉంటున్నాడు. భార్య నాగమణి నాలుగేళ్ల క్రితం మృతిచెందింది. పిల్లలు రమ్య, గణేష్ బంధువుల ఇంటికి వెళ్లడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో బుధవారం రాత్రి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న టెక్కలి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. కాగా, తాపీమేస్త్రీగా పనిచేసే కేశవరావు అప్పులు అధికంగా వాడినట్లు తెలుస్తోంది. ఇటీవల ఇంటి కరెంట్ బిల్లు సైతం కట్టకపోవడంతో కనెక్షన్ కట్‌చేశారని, ఫైనాన్స్ కట్టకపోవడంతో ద్విచక్ర వాహనం సైతం తీసుకెళ్లిపోయారని, మద్యాని బానిస కావడంతో చివరకు మనస్థాపం చెంది మృతిచెంది ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు. మృతుడి మామ జామి భీమరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టెక్కలి ఎస్‌ఐ రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీచ్ ఫెస్టివల్‌కు సన్నద్ధం



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

సోంపేట: బారువలో ఈ నెల 19, 20వ తేదీల్లో నిర్వహించనున్న బీచ్ ఫెస్టివల్‌ను విజయవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. బుధవారం బారువ బీచ్‌ను జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 19న ప్రారంభం కానున్న బీచ్ ఫెస్టివల్‌కు కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి అచ్చెన్నాయుడు హాజరవుతారని చెప్పారు. అదే రోజు సాయంత్రం 5.30 గంటలకు తాబేళ్ల పిల్లలను సముద్రంలోకి విడిచిపెడతామని తెలిపారు. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా బీచ్ క్లీనింగ్ జరుగుతుందన్నారు. క్రీడాపోటీలు, వీలైతే బోటింగ్ పోటీలు కూడా నిర్వహిస్తామని తెలిపారు. పంచాయతీ, పర్యాటక, అగ్నిమాపక, రహదారులు భవనాలు, అటవీశాఖ, విద్యుత్ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలి

జయపురం: విద్యార్థులకు గుణాత్మక విద్యనందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని జయపురం బ్లాక్ విద్యాధికారి చందనకుమార్ నాయిక్ అన్నారు. బుధవారం జైల్ రోడ్డు ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. హెచ్‌ఎం బసంతి స్వరో అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయిక్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో అదనపు బ్లాక్ విద్యాధికారి కైలాశ చంద్ర శతపతి, సీఆర్‌సీసీ సంజుక్త రౌత్, కౌన్సిలర్ దేవేంద్ర చౌధురి, చంద్రశేఖర భొత్ర, ఉపాధ్యాయులు ప్రభాతి కుమారి దిసారి, మధుస్మిత పాణిగ్రాహి తదితరులు పాల్గొన్నారు.



వార్షికోత్సవ వేదికపై డీఈఓ



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అదనపు డీఈఓ శతపతి

క్లుప్తంగా

జిల్లాలో న్యాయ సేవలు సంతృప్తికరం

• జిల్లా జడ్జి సాయి కల్యాణ్ చక్రవర్తి



జిల్లా జడ్జి దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

బొబ్బిలి: జిల్లాలో న్యాయమూర్తిగా అందజేసిన సేవలు తనకు సంతృప్తినిచ్చాయని జిల్లా జడ్జి బి.సాయికల్యాణ్ చక్రవర్తి అన్నారు. ఈ మేరకు బుధవారం స్థానిక కోర్టులో న్యాయమూర్తులు, న్యాయవాదులు జడ్జి సాయి కల్యాణ్ చక్రవర్తి దంపతులను ఘనంగా సత్కరించారు. శాఖాపరమైన బదిలీలో భాగంగా గుంటూరు జిల్లా జడ్జిగా వెళ్తున్నందున ఆయనను సత్కరించినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.మోహన్ మురళీ కుమార్ అన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు సీనియర్ న్యాయమూర్తి దామోదర రావు, స్థానిక సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణశ్రీ, ఏజేఎఫ్‌సీఎం రోహిణీరావు, న్యాయవాదులు కొల్లి సింహాచలం, ఎం.బెనర్జీ, ఎ.రామకృష్ణ, ఎం.సింహాచలం, డి.లక్ష్మి దీపవల్లి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్లు సీజ్



ఆర్డీఓ సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు

బొబ్బిలిరూరల్: మండలంలోని పారాది గ్రామం వద్ద వేగావతి నదిలో ఇసుకను తవ్వి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఆర్‌డీఓ జేవీవీ రామ్మోహనరావు బుధవారం సీజ్ చేశారు. బొబ్బిలి నుంచి విజయనగరం వెళ్తున్న ఆయన వేగావతి నదిలో ఇసుకను లోడ్ చేస్తుండగా గమనించి ట్రాక్టర్ డ్రైవర్లను తవ్వకాలపై ప్రశ్నించారు. ఎక్కడికి తరలిస్తున్నారని, అనుమతులు, పర్మిట్లు ఉన్నాయా అని ఆరాతీసిన ఆర్డీఓకు అవేమీ లేవని బొబ్బిలికి తరలిస్తున్నామని డ్రైవర్లు తెలపగా వెంటనే రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేయాలని తహసీల్దార్ శ్రీనుకు ఆర్డీఓ ఆదేశాలు జారీచేశారు.

ఎస్సైపై దాడికేసులో వ్యక్తి అరెస్టు




దాడిఘటన వివరాలు వెల్లడిస్తున్న సీఐ, వెనుక ముసుగులో నిందితుడు

రాజాం సిటీ: సంతకవిటి ఎస్సైపై దాడిచేసి ఘటనలో నిందితుడిని అరెస్టు చేశామని రూరల్ సీఐ హెచ్.ఉపేంద్ర తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన స్థానిక రూరల్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 13న సంతకవిటి మండలం జావాం గ్రామదేవత పగడాలమ్మ జాతర నిర్వహించారు. ఈ జాతరలో మద్దూరుశంకరపేట, జావాం గ్రామాల యువకుల మధ్య కొట్లాట జరిగింది. ఈ కొట్లాటను నివారించే క్రమంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్సై ఆర్.గోపాలరావుపై మద్దూరుశంకరపేట గ్రామానికి చెందిన యడ్ల రమణ దాడిచేసి మెడలో రెండు తులాల బంగారు చైను తీసుకుపోయాడు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదుచేసి నిందితుడిని మద్దూరుశంకరపేట గ్రామంలో అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామని సీఐ చెప్పారు. సమావేశంలో ఎస్సై ఆర్.గోపాలరావు, హెచ్‌సీ ప్రసాదరావు, పీసీ కృష్ణ తదితరులు ఉన్నారు.

ఉరివేసుకుని విద్యార్థి ఆత్మహత్య

• విశాఖపట్నంలోని శ్రీ చైతన్య కళాశాలలో ఘటన



విద్యార్థి వేదాంత కార్తికేయ (ఫైల్)

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన తీడ వేదాంత కార్తికేయ (16) విశాఖపట్నంలోని శ్రీ చైతన్య కళాశాలలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విద్యార్థి ఆత్మహత్య ఘటన స్థానికంగా సంచలనం రేకెత్తించింది. ఈనెల 7న విద్యార్థి కార్తికేయ ఇంటర్మీడియట్ విద్యాభ్యాసం కోసం విశాఖపట్నంలోని శ్రీచైతన్య కళాశాలలో జాయిన్ అయ్యాడు. ఈ క్రమంలో విద్యార్థి నాలుగు రోజులుగా అసౌకర్యంగా ఉండడంతో కళాశాల యాజమాన్యం నుంచి తల్లిదండ్రులకు సమాచారం అందింది. ఈ మేరకు తల్లిదండ్రులు అచ్యుతరావు, పార్వతి మంగళవారం కళాశాల హాస్టల్‌కు వెళ్లి విద్యార్థితో మాట్లాడారు. తరువాత విద్యార్థిని హాస్టల్‌లో ఉంచి ఇంటికి వెళ్లిపోయారు. మళ్లీ బుధవారం ఉదయం కళాశాల యాజమాన్యం తల్లిదండ్రులకు ఫోన్ చేసి కార్తికేయ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని సమాచారం అందించగా తల్లిదండ్రులు కుమారుడి వద్దకు వెళ్లి కన్నీరుమున్నీరుగా విలపించారు.

అగ్ని ప్రమాదాల నివారణకు

అవగాహన అవసరం

• 14 నుంచి ప్రారంభమైన జాతీయ వారోత్సవాలు



పార్వతీపురం మండలం చినబొండపల్లిలో ఎల్‌పీజీ గ్యాస్ ద్వారా వచ్చే ప్రమాదాల నివారణకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పార్వతీపురం రూరల్: ఇటీవల కాలంలో అగ్నిప్రమాదాలు తరచూ సంభవిస్తూనే ఉన్నాయి. అవగాహన లేక కొందరు, నిర్లక్ష్యం వహించి మరికొందరు ఈ ప్రమాదాలకు కారణం అవుతున్నారు. ఈ నేపథ్యంలో అగ్నిమాపక శాఖ అధికారులు ప్రతి ఏడాది అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ ఏడాది 'అగ్ని సురక్ష దేశం కోసం- అందరం ఏకమవడం' అనే నినాదంతో వారోత్సవాలను నిర్వహిస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా నాలుగు అగ్నిమాపక కేంద్రాలు

పార్వతీపురం జిల్లా కేంద్రం, గుమ్మలక్ష్మీపురం, సాలూరులో, పాలకొండలో అగ్నిమాపక కేంద్రాలున్నాయి.

ఈ జాగ్రత్తలు పాటిస్తే మేలు

వేసవిలో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉన్నందున పలు జాగ్రత్తలు పాటిస్తే మేలని అగ్నిమాపక శాఖ అధికారులు చెబుతున్నారు.

- అగ్గిపెట్టె లైటర్లు మండే పదార్థాలకు చిన్న పిల్లలను దూరంగా ఉంచాలి
- నాణ్యతా ప్రమాణాలు ఉన్న ఎలక్ట్రికల్ పరికరాలను మాత్రమే వినియోగించాలి
- సెలవులపై ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు ఇంటి మెయిన్ ఆఫ్ చేయడం సురక్షితం
- వంట గదిలో గాలి వెలుతురు ఉండేలా చూసుకోవాలి
- గ్యాస్ వాడకం పూర్తయిన తర్వాత సిలిండర్ వద్ద రెగ్యులర్ వాల్వ్‌ను నిలిపివేయాలి
- విద్యాసంస్థలు, ఆస్పత్రి, హోటల్‌లో అగ్నిప్రమాదాలు జరిగేటప్పుడు క్షేమంగా బయటపడేందుకు సరైన ప్రణాళికలను తయారుచేసి అవి అందరికీ అందుబాటులో ఉండే విధంగా చూడాలి

వారోత్సవాల్లో నిర్వహించే కార్యక్రమాలు

- 17న ఆస్పత్రిలోని సిబ్బందికి తరగతులు, మాక్ డ్రిల్ ప్రదర్శన
- 18న పరిశ్రమలు, పెట్రోల్ బంకులు, గ్యాస్ గోదాముల్లో అవగాహన తరగతులు
- 19న కల్యాణ మంటపాలు, విద్యాసంస్థల్లో ఫైర్ సేఫ్టీ తనిఖీలు
- 20 న రాజకీయ పార్టీ ప్రతినిధులతో అగ్నిమాపక కార్యాలయంలో ప్రమాదాల నివారణపై శిక్షణ తరగతుల సమావేశం.

సమయస్ఫూర్తితో జాగ్రత్తలు పాటించాలి



షాపింగ్ మాల్‌కు, అలాగే నూతన ప్రదేశాలకు వెళ్లేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. అక్కడ గోడలపై అంటించిన ఫైర్ సేఫ్టీ మ్యాపులను చూడాలి. అగ్నిప్రమాదాల నివారణపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం. ప్రమాదాలు జరిగిన చోటికి సమాచారం అందగానే క్షణాల్లోనే చేరుకునేలా సిబ్బంది అప్రమత్తంగా ఉంటున్నారు. అవసరమైన మేరకు సమీపంలో ఉన్న కేంద్రాల నుంచి కూడా అగ్నిమాపక వాహనాలను తెప్పిస్తున్నాం.

– కె. శ్రీనుబాబు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి, పార్వతీపురం మన్యం జిల్లా

చట్టాలపై స్పష్టమైన అవగాహన ఉండాలి

• ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి



ఉత్తమ సేవలకు యాంత్రిక సురక్ష, ఉత్కృష్ట సేవా పతకాలు అందజేస్తున్న ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి

పార్వతీపురం రూరల్: పోలీస్ శాఖలో విధి నిర్వహణలో ఉన్న ప్రతి ఒక్కరికీ చట్టాలపై స్పష్టమైన అవగాహన ఉండాలని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలతో పోలీస్ కాన్ఫరెన్సు హాల్‌లో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించి పెండింగ్‌లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులు, మర్డర్, ప్రాపర్టీ, వాహనాలు దొంగతనం, 174 సీఆర్పీఎస్ కేసులు, మిస్సింగ్, చీటింగ్ కేసులు, సైబర్ నేరాలు, ఇతర కేసులపై సమీక్షించారు. పోలీస్‌స్టేషన్లలో నమోదయ్యే కేసుల వివరాలను ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా సీసీటీఎన్‌ఎస్‌లో ఎప్పటికప్పుడు పొందుపరచాలని ఎస్పీ ఈ సందర్భంగా ఆదేశించారు.

కళాశాలలో ర్యాగింగ్ లేకుండా అవగాహన కల్పించాలి

ఈ నేర సమీక్ష సమావేశంలో ఐజీ కేవీ మోహన్ రావు వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ..జిల్లా పరిధిలో ఉన్న కాలేజీల్లో విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడకుండా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, మహిళా సంబంధిత నేరాలపై ప్రత్యేక శ్రద్ధతో దర్యాప్తు జరపాలని సూచించారు. పార్వతీపురం మన్యం జిల్లా ప్రాంతం ఒడిశా సరిహద్దులో ఉండడం వల్ల రాష్ట్రానికి ఎక్కువ మొత్తంలో గంజాయి అక్కడినుంచి వస్తున్నందున రైల్వే, ఆర్పీఎఫ్ ఫోర్స్‌తో సమన్వయం చేసుకుని విధులు నిర్వర్తించాలని ఐజీ ఆదేశించారు.

ప్రతిభకు పురస్కారం

విధి నిర్వహణలో ప్రతిభ చూపిన పోలీస్ అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలను ఎస్పీ అందజేసి అభినందించారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం 2022, 2023వ సంవత్సరంలో విధి నిర్వహణలో ఉత్తమసేవలు అందించిన వారికి గుర్తింపుగా అందజేసిన యాంత్రిక సురక్ష, ఉత్కృష్ట సేవా పతకాలను సిబ్బందికి ఎస్పీ అందజేశారు. సమావేశంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీస్ శాఖ ఉన్నతాధికారులు, సీఐలు, ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

ముద్దాయికి ఆరు నెలల జైలుశిక్ష

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలో జరిగిన దొంగతనాల కేసులో చీపురుపల్లి మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు సివిల్‌జడ్జి వై.ప్రేమలత ముద్దాయికి ఆరునెలల జైలుశిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు ఎస్సై బి.లోకేశ్వరరావు తెలిపారు. గరివిడి పోలీస్‌స్టేషన్ పరిధిలో గల దుమ్మెద, వెదుళ్లవలస,కొండలక్ష్మీపురం గ్రామాల్లో 2019లో దొంగతనాలు జరిగాయి. ఈ సంఘటనలపై అప్పుడే కేసులు నమోదు చేశారు. ఈ కేసుల్లో బుధవారం కోర్టులో విచారణ జరపగా నేరం రుజువు కావడంతో ముద్దాయి పున్నాన రాంబాబుకు ఆరు నెలల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై వివరించారు.

హుషారుగా ఏనుగుల గుంపు



బిల్లుమడ సమీపంలో షికారు కొడుతున్న ఏనుగుల జంటలు

భామిని: మండలంలోని బిల్లుమడ సమీపంలో గల జీడితోటల్లో బుధవారం ఏనుగుల గుంపు హుషారుగా దర్శనమిచ్చింది. రెండు రోజుల క్రితం సింగిడికి చెందిన పింటూ సాంత్రో ఆరటి గెలను ఏనుగులకు అందివ్వబోయి కిందపడి రభస జరిగిన అనంతరం అటవీశాఖాధికారులు ఆందోళన చెందారు. పాలకొండ ఫారెస్ట్ రేంజర్ వచ్చి పరిస్థితి సమీక్షించి ఏనుగులను రెచ్చగొట్ట వద్దని ప్రజలకు చేసిన సూచనల మేరకు చూపరులు దూరమయ్యారు. ఈ క్రమంలో ఏనుగులు హుషారుగా యథావిధిగా తిరుగుతూ కనిపించాయి.

ఆలయ నిర్మాణానికి విరాళం

చీపురుపల్లి: ఇటీవల శబరిమల వనయాత్ర చేసిన పట్టణానికి చెందిన అయ్యప్ప స్వాముల బృందం పట్టణంలో నిర్మిస్తున్న హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయానికి రూ.18 వేలు విరాళం అందజేసింది. నగదును ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, ఎంపీపీ తనయుడు ఇప్పిలి విహార్ చేతుల మీదుగా బుధవారం అందజేశారు. ట్రస్టు బోర్డు సభ్యులు అప్పికొండ ఆదిబాబు, ఎస్.వి.జి.శ్రీనివాసరావు, గంట్యాడ విష్ణు, నాగు, ఒమ్మి రమేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి తిరుమల, ముల్లు పైడిరాజు, కొమ్ము చిరంజీవి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు

• డీపీఎం ఆనందరావు



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన చేస్తున్న ఏఓ, డీపీఎం

పూసపాటిరేగ: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయాధికారి కె. నీలిమ, డీపీఎం ఆనందరావు అన్నారు. మండలంలోని ఎరుకొండ గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయంతో భూమి సారం కోల్పోదన్నారు. పైగా కార్బన్ శాతం పెరిగి అధిక దిగుబడులు వస్తాయని చెప్పారు. ఖరీఫ్‌కు ముందు నవ ధాన్యాలు సాగు చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఒకేసారి మూడు బ్యాంకు ఉద్యోగాలు



మూడు బ్యాంకు కొలువులు సాధించిన చూడామణి

రేగిడి: ప్రస్తుతకాలంలో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలంటే చాలా కష్టపడాల్సిందే. ఈ కష్టానికి తోడు అదృష్టం కలిసిరావాలి. అప్పుడే ప్రభుత్వ కొలువైనా..ప్రైవేట్ ఉద్యోగమైనా లభిస్తుంది. అటువంటిది రేగిడి మండలంలోని ఓ యువకుడిని ఒకే దఫా మూడు బ్యాంకు ఉద్యోగాలు వరించాయి. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కొండవలస గ్రామానికి చెందిన బెవర చూడామణి ఒకే ప్రయత్నంలో మూడు బ్యాంకు ఉద్యోగాలు సాధించాడు. లోకల్ యూనియన్ బ్యాంకులో ఎల్‌బీఓగా, బ్యాంకు ఆఫ్ మహారాష్ట్రగా ప్రొబేషనరీ ఆఫీసర్‌గా, తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఆఫీస్ అసిస్టెంట్/క్యాషియర్‌గా ఉద్యోగాలు సాధించాడు. డిగ్రీ అనంతరం మూడు సంవత్సరాలు విజయవాడలో బ్యాంకు ఉద్యోగాల నిమిత్తం చూడామణి కోచింగ్ తీసుకుంటున్నాడు. చివరికి తన ప్రయత్నం ఫలించి, మూడు ఉద్యోగాలు సాధించి లక్ష్యాన్ని చేరుకున్నాడు. ఆయన తండ్రి బెవర గోపాలకృష్ణ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తుండగా, తల్లి గౌరీశ్వరి గృహిణి. కొద్దిపాటి వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. ఈ సందర్భంగా చూడామణి మాట్లాడుతూ తన తల్లిదండ్రుల కష్టంతో పాటు రాజాంలోని ఎస్‌ఎల్‌టీఎస్ కళాశాల ప్రిన్సిపాల్, తన పినతండ్రి ఉదయ్‌భాస్కర్ రాజా ప్రోత్సాహంతో తాను ఈ కొలువులు సాధించానని వెల్లడించాడు.

పలు రైళ్లు రద్దు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం-సీతానగరం రైల్వే స్టేషన్ల మధ్య ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా రైల్వే ఉన్నతాధికారులు పలు రైళ్ల రాకపోకలను రద్దు చేసినట్లు స్టేషన్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విశాఖ-కొరాపుట్ పాసింజర్, విశాఖ రాయపూర్ పాసింజర్, విశాఖ-కొరాపుట్ వీక్లీ ఎక్స్‌ప్రెస్‌లను ఏప్రిల్ 22 నుంచి మే 5 వరకు రద్దు చేసినట్లు పేర్కొన్నారు. 'విజయనగరం వరకే గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్ గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 21 నుంచి మే 3 వరకు గుంటూరులో బయల్దేరి విశాఖ మీదుగా విజయనగరం వరకు వస్తుందని తెలిపారు. తిరుగు ప్రయాణంలో రాయగడకు బదులు విజయనగరం నుంచి బయలుదేరి విశాఖ మీదుగా గుంటూరు వెళ్తుందని ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

రహదారి భద్రతా నియమాలు పాటిద్దాం..



గొడిపాలెం అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్సై సన్యాసినాయుడు

• ఎస్సై సన్యాసినాయుడు

డెంకాడ: ప్రజలందరం రహదారి భద్రతా నియమాలు పాటించాలని ఎస్సై ఎ.సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని గొడిపాలెం, బంటుపల్లి, పెదతాడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మెర్సీమిషన్ పాఠశాలల్లో నేరాల నియంత్రణ, తదితర అంశాలపై బుధవారం అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యక్రమాలను నిరోధించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. మితిమీరిన వేగంతో డ్రైవింగ్ చేస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు ఇవ్వకూడదని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు తప్పవన్నారు.

ఏఆర్ కానిస్టేబుల్ పేరిట వాలీబాల్ టోర్నమెంట్

• ప్రారంభించిన ఏఎస్పీ



వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఏఎస్పీ సౌమ్యలతతో పాటు ఏఆర్ అడ్మిన్ గోపాలరావు

విజయనగరం క్రైమ్: స్థానిక పోలీస్ బ్యారెక్స్‌లో ఏఆర్ కానిస్టేబుల్ పేరిట వాలీబాల్ టోర్నమెంట్ బుధవారం ప్రారంభమైంది.ఈ పోటీలను ఏఎస్పీ సౌమ్యలత ప్రారంభించారు. ఇటీవలే ఏఆర్ విభాగానికి చెందిన సీహెచ్.గోపాలరావు అనారోగ్యంతో మృతి చెందగా ఆయన స్మారకార్థం ఏఆర్ సిబ్బంది, లా అండ్ ఆర్డర్ సిబ్బంది వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిద్దామని పోలీస్‌శాఖ అడ్మిన్ ముందుంచారు. ఏఎస్పీ అనుమతితో పరేడ్ మైదానంలో వాలీబాల్ పోటీలు జరిగాయి. ఈ పోటీలకు అన్ని పోలీస్‌స్టేషన్ల నుంచి లా అండ్ ఆర్డర్, ఏఆర్‌కు చెందిన సిబ్బంది పాల్గొన్నారు. పోటీలను ప్రారంభించిన ఏఎస్పీ సౌమ్యలత మాట్లాడుతూ గోపాల్ రావును స్మరించుకుంటూ తోటి సిబ్బంది ఈ పోటీలను నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. టోర్నమెంట్‌లో విజయనగరం, గంట్యాడ, కొత్తవలస, బలిజిపేటకు చెందిన టీమ్‌లు పాల్గొన్నాయి. ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.12 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.8 వేలు, తృతీయస్థానంలో నిలిచిన జట్టుకు రూ.6 వేలు, కన్సొలేషన్ ప్రైజ్‌కు రూ.4 వేల నగదును బహుమతిగా ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ నాగేశ్వరరావు, ఎస్బీ సీఐలు లీలారావు, చౌదరి, ఆర్‌ఐలు గోపాల్‌రావు, శ్రీనివాసరావు, ఆర్ఎస్సైలు సూర్యనారాయణ, రామారావు, ముబారక్ ఆలీ, దివంగత కానిస్టేబుల్ సతీమణి శారద పాల్గొన్నారు.

డిజిటల్ అరెస్ట్ కేసులో ఏబీసీడీ అవార్డు

• డీజీపీ చేతుల మీదుగా అందుకున్న వన్‌టౌన్ సీఐ



డీజీపీ హరీకుమార్ గుప్తా చేతుల మీదుగా అవార్డును అందుకున్న విజయనగరం వన్ టౌన్‌సీఐ శ్రీనివాస్, ఎస్సై ప్రసన్న కుమార్, పీసీ రామరాజు, చిత్రంలో ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: విజయనగరం పోలీస్ సబ్ డివిజన్ పరిధి విజయనగరం వన్‌టౌన్ స్టేషన్ సీఐగా ఎనిమిది నెలల క్రితం చార్జ్ తీసుకున్న శ్రీనివాస్ ముంబై, పుణెలకు వెళ్లి మరీ నిందితులను పట్టుకున్నందుకు రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా చేతుల మీదుగా మంగళగిరిలో బుధవారం అవార్డ్ ఫర్ బెస్ట్ ఇన్ క్రైమ్ డిటెక్షన్‌ను అందుకున్నారు. వివిధ పోలీస్‌స్టేషన్‌లలో ప్రతి మూడు నెలలకోసారి పలు కేసుల ఛేదనలో స్థానిక స్టేషన్‌హౌస్ ఆఫీసర్లు చూపిన ప్రతిభను డీజీపీ ఆఫీస్ పరిశీలనలోకి తీసుకుంటుంది. అందులో భాగంగా గతేదాది దాదాపు కోటిన్నర పైగా డబ్బులు పోయాయని వన్‌టౌన్ పోలీసులు ఫిర్యాదు అందుకున్నారు. ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాలతో అప్పుడే విజయనగరం వన్‌టౌన్ పోలీసులు డిజిటల్ అరెస్ట్‌గా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆ కేసులో విజయనగరం వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్, ఎస్సై లక్ష్మీ ప్రసన్నకుమార్‌లు జమ్ము, ముంబై, పుణె ప్రాంతాల్లో ఉండి మరీ ఐదుగురు నిందితులను పట్టుకున్నారు. ఈ క్రమంలోనే ఏబీసీడీ అవార్డు పరిశీలనలోకి వెళ్లారు. రాష్ట్ర డీజీపీ కార్యాలయం పరిశీలనలో విజయనగరం వన్‌టౌన్ సీఐ, ఎస్ఐల పేర్లు రావడం, మంగళగిరి నుంచి పిలుపు రావడంతో ఎస్పీ వకుల్ జిందల్‌తో కలిసి వెళ్లి వారు ఈ అవార్డును అందుకున్నారు.

ఉద్రిక్తతల నడుమ పామాయిల్ మొక్కల తొలగింపు



దేవాదాయ శాఖ అధికారులు రక్షణ కవచంలా నిలబడి అర్చక కుటుంబీకులను అడ్డుకుంటున్న దృశ్యం

సంతకవిటి: మండలంలోని సిరిపురం గ్రామంలో కొండపై వెలసిన కొండకామేశ్వర స్వామి ఆలయం ఇటీవల దేవాదాయ శాఖ ఆధీనంలోకి వచ్చింది. ఈ ఆలయానికి సంబంధించి సర్వే నంబర్ 84లో 2.70 ఎకరాల భూమి ఉంది. ఈ పొలాన్ని కౌలుకు ఇచ్చేందుకు అధికారులు ముందుకు రావడంతో ఆలయ అర్చకుడు అడ్డుపడగా రెండు పర్యాయాలు వాయిదా పడింది. పొలంలోని పామాయిల్ మొక్కలు తొలగిస్తేనే కౌలుకు తీసుకునేందుకు ముందుకు వస్తామని సిరిపురం గ్రామ ప్రజలు పట్టుబట్టడంతో విజయనగరం దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కె.శిరీష బుధవారం గ్రామానికి చేరుకుని జేసీబీ సహాయంతో మొక్కలను తొలగించారు. జేసీబీ పొలంలో దిగుతున్న సమయంలో, మొక్కలు తొలగిస్తున్న సమయంలో అర్చకుల కుటుంబసభ్యులు పదేపదే జేసీబీకి అడ్డుతగిలారు. ఈ క్రమంలో అధికారులే రక్షణ కవచంలా నిలబడి వారిని నిలువరించారు. పోలీసులకు ముందస్తు సమాచారం అందించినా ఎవరూ కనీసం రాలేదని దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కె.శిరీష వాపోయారు. పని పూర్తి కావస్తున్న సమయంలో కేవలం ఇద్దరు పోలీసులు రావడం విశేషం. కార్యక్రమంలో ఈఓ బి.వి.మాధవరావు, రాజాం నవదుర్గ దేవాలయం ఈఓ పి.శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు.

రోబోటిక్స్ కోర్సులకు డిమాండ్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అసోసియేట్ ప్రొఫెసర్ సంజయ్ ధర్వేకర్

నెల్లిమర్ల రూరల్: రానున్న కాలంలో రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు సంబంధించిన కోర్సులకు మంచి డిమాండ్ ఉందని గాయత్రి విద్యా పరిషత్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సంజయ్ ధర్వేకర్ అన్నారు. ఈ మేరకు నెల్లిమర్ల మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో రోబోతాన్ 2కే25 కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎంచుకున్న రంగంలో పూర్తి పట్టు సాధిస్తే భవిష్యత్తులో మంచి ఫలితాలు ఉంటాయన్నారు. అనంతరం విద్యార్థుల ప్రాజెక్టుల మూల్యాంకనం చేసి బాగున్నాయని కితాబిచ్చారు. కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి, ప్రొఫెసర్ దీపక్ కుమార్, సన్నీ డియోల్, పీఎస్వీ రమణారావు, శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈదురుగాలులకు నేలకొరిగిన వృక్షం



నేలకొరిగిన చెట్టు

పార్వతీపురంటౌన్: పట్టణంలో బుధవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈదురుగాలులకు కలెక్టరేట్ సమీపంలో ప్రకాశం క్లబ్-విశ్వవిజ్ఞాన విద్యాలయం మధ్యలో రోడ్డుపై చెట్టు విరిగిపడింది. దీంతో ఆ రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పట్టణంలో కురిసిన వర్షానికి పలు వార్డుల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి



రాములప్పడు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

డెంకాడ: మండలంలోని చొల్లంగిపేట జంక్షన్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలంలోని ఎన్‌జీఆర్ పురం గ్రామానికి చెందిన జిగిలి రాములప్పడు(54) అక్కడికక్కడే మృతి చెందగా మృతుడి భార్య మహలక్ష్మి తీవ్ర గాయాలపాలైంది. దీనిపై ఎస్సై ఎ.సన్యాసినాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాములప్పడు, భార్య మహాలక్ష్మి తమ కుమార్తె వివాహ విషయమై మాట్లాడేందుకు విజయనగరం జిల్లా గజపతినగరం మండలంలోని గంగచోళ్లపెంట గ్రామానికి వెళ్తున్నారు. కుమిలి-విజయనగరం రోడ్డులోని చొల్లంగిపేట జంక్షన్‌కు వచ్చేసరికి బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న గోతిలో పడిపోయింది. దీంతో బైక్ నడుపుతున్న రాములప్పడు అక్కడికక్కడే దుర్మరణం చెందగా, బైక్ వెనుక కూర్చున్న మహాలక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన ఆమెను చికిత్స నిమిత్తం విజయనగరం తరలించారు. మృతుడి సోదరుడు జిగిరి రాముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సన్యాసినాయుడు తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత..



మృతి చెందిన కొండమ్మ

గరుగుబిల్లి: రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన వివాహిత చికిత్స పొందుతూ మృతిచెందింది. దీనికి సంబంధించి హెచ్‌సీ ఈశ్వరరావు బుధవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా రాజాం పట్టణానికి చెందిన సవలాపురపు సంజీవ్, భార్య కొండమ్మ పార్వతీపురం మండలంలోని గోపాలపురంలో చింతాడ కామేశ్వరి (కొండమ్మ చెల్లి) పెళ్లిరోజు వేడుకలకు హాజరై 15న సాయంత్రం ద్విచక్రవాహనంపై గోపాలపురంనుంచి స్వగ్రామం రాజాం వెళ్తున్నారు. ఈ క్రమంలో మార్గమధ్యంలో గరుగుబిల్లి మండలంలోని రావివలస జంక్షన్ సమీపంలో వెనుక కూర్చున్న కొండమ్మ ప్రమాదవశాత్తు బైక్‌నుంచి జారిపడగా తలకు బలమైన గాయమైంది. దీంతో మెరుగైన చికిత్సకోసం విజయనగరం తరలించగా చికిత్స పొందుతూ మరణించింది. ఈ మేరకు మృతురాలు కొండమ్మ, తండ్రి రేజేటి పైడిరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.